సాక్షి
పెద్దపల్లి
ఆదివారం | 16 | జూలై | 2023

సండే స్పెషల్

అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుదుతున్న మహిళలు





అపెరల్ పార్క్‌లోని గ్రీన్ నీడిల్ యూనిట్ ప్రవేశద్వారం

మేడిన్ సిరిసిల్ల

• రెడీమేడ్ వస్త్రాలకు కేరాఫ్ • సిరిసిల్ల నుంచి అమెరికాకు ఎగుమతులు • అపెరల్ పార్క్‌లో వస్త్రాల తయారీ • మహిళలకు మెరుగైన ఉపాధి

సిరిసిల్ల: చేస్తే బీడీలు.. లేదంటే ఖాళీగా కూర్చోవడం.. ఇది ఒకప్పటి సిరిసిల్ల ప్రాంతంలోని మహిళల పరిస్థితి. రాత్రిపగలు బీడీలు చేస్తే నెలకు రూ.3వేలు రాని రోజుల నుంచి నెలకు రూ.10 వేల వరకు సంపాదిస్తున్నారు. సిరిసిల్లలో అపెరల్‌పార్క్ ఏర్పాటుతో మహిళల జీవితాల్లో అనేక మార్పులు వచ్చాయి. రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్‌లో పనిచేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో దాదాపు 500 మంది వరకు మహిళలు ఉపాధి పొందుతున్నారు. అరకొర ఆదాయంతో గడ్డు రోజులు గడిపిన వీరు.. నేడు మెరుగైన వేతనాలతో ఆనందంగా జీవిస్తున్నారు.



ఈమె సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన అక్షయ. పదో తరగతి వరకు చదువుకుంది. భర్త భాస్కర్ వార్పర్‌గా వస్త్రపరిశ్రమలో పనిచేస్తారు. అక్షయ బీడీలు చేస్తూ తీరిక వేళల్లో మిషన్ కుడుతూ నెలకు రూ.4వేల వరకు సంపాదించేది. సిరిసిల్ల శివారులోని అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ ప్రారంభం కావడంతో అక్కడ ట్రైనర్‌గా జాయిన్ అయింది. 15 రోజుల పాటు బెంగళూర్‌లో శిక్షణనిచ్చారు. ఇప్పుడు సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ నెలకు రూ.10,300 సంపాదిస్తుంది.



ఈమె సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌కు చెందిన బింగి కావ్య. పదో తరగతి వరకు చదివింది. భర్త విష్ణు పవర్‌లూమ్ కార్మికుడు. వీరికి ఇద్దరు అమ్మాయిలు. కావ్య గతంలో బీడీలు చేయగా నెలకు రూ.3వేలు వచ్చేవి. ఏడాదిన్నరగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతూ నెలకు రూ.7,500 సంపాదిస్తుంది.



మిషన్ కుడుతున్న ఈమె బదుగు ప్రణయ. సిరిసిల్ల శివారులోని పెద్దూరుకు చెందిన ఈమె కరీంనగర్ ఉమెన్స్ కాలేజీలో బీఎస్సీ చదివింది. ఇంటి వద్ద ఖాళీగా ఉంటుండగా అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్ పడింది. అక్కడ జూకీ మిషన్‌పై కుట్టు నేర్చుకుని చేరింది. నెలకు రూ.7వేల వరకు వస్తున్నాయి. ఆమె భర్త నాగరాజు కూడా ఇక్కడే పనిచేస్తారు. ఆయనకు రూ.15వేలు వస్తాయి.



వస్త్రాల కటింగ్



రెడీమేడ్ వస్త్రాల నాణ్యతను పరిశీలిస్తున్న మహిళలు



రెడీమేడ్ వస్త్రాలను ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల టు అమెరికా

పెద్దూరు వద్ద 60 ఎకరాల్లో ఏర్పాటు చేసిన అపెరల్ పార్క్‌లో గతేడాది గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ తొలి యూనిట్‌ను ప్రారంభించింది. గ్రీన్‌నీడిల్ పేరుతో రెడీమేడ్ వస్త్రాలను తయారీ చేస్తుంది. ప్రస్తుతం 400 మంది మహిళలు ఉపాధి పొందుతుండగా.. మరో 60 మంది అనుబంధంగా పనిచేస్తున్నారు. ఇంకో వెయ్యి మందికి పని కల్పించే లక్ష్యంతో యూనిట్‌ను విస్తరిస్తున్నారు. ఇక్కడ నిత్యం 5 వేల నుంచి 10 వేల వరకు లోదుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ లోదుస్తులు వివిధ కంపెనీల పేర్లతో ముంబైకి, అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ తయారైన వస్త్రాలు వాల్‌మార్ట్, అమెజాన్ వంటి సంస్థల ద్వారా ప్రపంచస్థాయికి ఎగుమతి కావడం విశేషం. రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ప్రత్యేక చొరవతో అపెరల్‌పార్క్ కార్యరూపం దాల్చింది. ఇంకా మరిన్ని యూనిట్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అవి పూర్తయితే జిల్లాలో మహిళల ఉపాధికి కేరాఫ్‌గా అపెరల్ పార్క్ మారనుంది.

ఉచితంగా బస్సు సౌకర్యం

సిరిసిల్ల, వేములవాడ, జిల్లెల్ల, ఎల్లారెడ్డిపేట మార్గాల్లో ఐదు బస్సులను గ్రీన్‌నీడిల్ సంస్థ ఏర్పాటు చేసింది. ఆ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణం చేస్తూ పనిచేస్తున్నారు. యూనిట్‌లోనే క్యాంటిన్ ఏర్పాటు చేశారు. ఉచితంగానే భోజన వసతి కల్పించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు.. రెండు షిఫ్ట్‌ల్లో రెడీమేడ్ వస్త్రాల తయారీ జరుగుతోంది. చిన్నపిల్లలు ఆడుకోవడానికి కేర్‌సెంటర్, వాష్‌రూమ్స్, రెస్ట్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. మహిళా వాచ్‌మెన్లు ఉన్నారు. అనుమతి లేకుండా ఒక్కరిని కూడా లోనికి ప్రవేశించనీయరు. కొత్త వారికి 15 రోజులపాటు శిక్షణనిచ్చి పని కల్పిస్తున్నారు.

యూనిట్‌ను విస్తరిస్తాం



మా దగ్గర ప్రస్తుతం 400 మంది మహిళలు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరు రూ.8,300 నుంచి రూ.11వేల వరకు వేతనాలు పొందుతున్నారు. ఇంకా యూనిట్‌ను విస్తరించాలని సంస్థ భావిస్తోంది. వెయ్యి మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో సిరిసిల్ల యూనిట్‌ను విస్తరించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక్కడ మహిళలు కష్టపడి, ఇష్టంగా పనిచేస్తున్నారు. యూనిట్ బాగా నడుస్తోంది.

– మధుకుమార్, గోకుల్‌దాస్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్

మరిన్ని వస్తున్నాయి



అపెరల్ పార్క్‌లోకి మరిన్ని యూనిట్లు వస్తున్నాయి. ప్రస్తుతం గోకుల్ దాస్ సంస్థ పనిచేస్తుండగా.. టెక్స్‌ఫోర్ట్ అనే మరో సంస్థ రెండు మూడు నెలల్లో వస్తుంది. ఇది పూర్తయితే రెండు వేల మంది మహిళలకు ఉపాధి లభిస్తుంది. గార్మెంట్ రంగంతో మెరుగైన బతుకుదెరువు దరి చేరుతుంది.

– వి.అశోక్‌రావు, ఆర్‌డీడీ చేనేత, జౌళిశాఖ

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



కలెక్టరేట్‌కు వస్తున్న సంగీత, ముజమ్మిల్‌ఖాన్



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: జిల్లా కలెక్టర్‌గా నియమితులైన ముజమ్మిల్ ఖాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సంగీత, అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం తన కార్యాలయంలో సంగీత నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్‌ను కలెక్టరేట్ సిబ్బంది, ఏఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు కలిశారు.

ఎల్లంపల్లిలోకి రెండు మోటార్లతో ఎత్తిపోతలు



ఎల్లంపల్లిలోకి ఎత్తిపోస్తున్న కాళేశ్వరం నీరు

రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి కాళేశ్వరం పార్వతీ పంపుహౌజ్ నుంచి రెండు మోటార్లతో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. రెండు మోటార్లతో 10,440 క్యూసెక్కుల నీరు పంపింగ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నంది పంప్‌హౌజ్‌లో..

ధర్మారం: మండలంలోని నంది పంప్‌హౌజ్ నుంచి కాళేశ్వరం జలాలను ఎత్తిపోయిస్తున్నారు. ఒక్కో మోటార్ ద్వారా 2,150 క్యూసెక్కుల నీటిని మేడారం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయిస్తున్నారు. అదే స్థాయిలో రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయిత్రీ పంప్‌హౌజ్‌కు నీటిని తరలిస్తున్నట్లు ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

సైన్స్ కో–ఆర్డినేటర్‌గా కానుగంటి శ్రీనివాస్



గోదావరిఖనిటౌన్: 'ఖని'కి చెందిన కానుగంటి శ్రీనివాస్‌ను నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్‌గా నియమిస్తున్నట్లు డీఈవో మాధవి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ ప్రస్తుతం మంథని మండలం ఆరెంద జెడ్పీహెచ్‌ఎస్ ఎఫ్ఏసీ హెచ్‌ఎంగా కొనసాగుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా కో–ఆర్డినేటర్‌గా పనిచేసిన శ్రీనివాస్ జాతీయస్థాయిలో విద్యార్థులను ఉత్తమ కనబర్చేలా కృషిచేశారు. ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగించినట్లు డీఈఓ తెలిపారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన డీఈఓకు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్‌ఎస్, బీజేపీ నిరంకుశ పాలనను నిలదీయాలి



గ్రామస్తులతో విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్, బీజేపీ నిరంకుశపాలనను ప్రజలు నిలదీయాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చిలుక సతీశ్, రమేశ్, మాధవరావు, కొండల్‌రావు, ముకేశ్, పర్శరాములు తదితరులు ఉన్నారు.

కారులో 'ఆ నలుగురు'

- కోల్‌బెల్ట్‌లో రాజుకున్న రాజకీయ వేడి
- పోటాపోటీగా సాగుతున్న పాదయాత్రలు
- ఆశావహులను అడ్డుకునేందుకు యత్నించిన ఎమ్మెల్యే అభిమానులు
- పార్టీ గెలుపు కోసమే పాదయాత్ర అంటున్న ఆశావహులు



సాక్షి, పెద్దపల్లి: రామగుండం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. రాష్ట్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు అనుగుణంగా అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు అప్రమత్తం అవుతున్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూనే వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలో పట్టుకోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో మాత్రం స్వపక్షంలోనే విపక్షంలా సొంత పార్టీ నేతలే అసమ్మతి రాగం ఎత్తుకుని పాదయాత్రల పేరుతో హల్‌చల్ చేస్తున్నారు. ఎన్నికలవేళ ఏకతాటికి రావాల్సిన నేతలు ఎవరికివారే తమ క్యాడర్ బలోపేతంపై దృష్టిపెడుతున్నారు. సొంతపార్టీ నేతలకే సవాళ్లు విసురుతూ.. ఎలాగైనా పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుని వచ్చే ఎన్నికల్లో టికెట్ సాధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్‌లో నలుగురు ఆశావహులైె జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, మాజీ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు పాతపెల్లి ఎల్లయ్య బృందంగా ఏర్పడి ఏకంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు పోటీగా పాదయాత్ర చేస్తుండడంతో గులాబీ పార్టీలో ఇంటిపోరు తారస్థాయికి చేరుకుంది. దీంతో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా.. ఏ నలుగురు కలిసినా 'ఆ నలుగురి' గురించే చర్చ కొనసాగుతోంది.

బీఆర్‌ఎస్‌లో రచ్చరచ్చ..

పట్టించుకోని అధిష్టానం

రామగుండం నియోజకవర్గంలో కొన్నిరోజులుగా నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తుండగా ఎమ్మెల్యే టార్గెట్‌గా కందుల సంధ్యారాణి, మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, పాతపెల్లి ఎల్లయ్య బృందంగా ఏర్పడి శనివారం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావాలని కోరుతూ 'ప్రజా ఆశీర్వాద యాత్ర' పేరుతో పాదయాత్ర ప్రారంభించారు. మేయర్ అనిల్‌కుమార్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మధ్య కొద్దిరోజులుగా కోల్డ్‌వార్ నడుస్తుండగా.. తాజాగా ఆ నలుగురు నేతలు మేయర్ డివిజన్‌లోనే పాదయాత్ర ప్రారంభించటంతో నేతల మధ్య ఆధిపత్యపోరు నిజమేనని స్పష్టమవుతోంది. మరోపక్క ఎమ్మెల్యే అనుచరులు, అభిమానులు వారి పాదయాత్రను అడ్డుకునేందుకు ప్రయత్నించటంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా అధ్యక్షుడు పార్టీలో ఎమ్మెల్యే ఆశావహులను అదుపులో పెట్టలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్టానం లేదా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొప్పుల ఈశ్వర్ అయినా చొరవ తీసుకొని నియోజకవర్గంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు అడ్డకట్టవేయాలని, లేకపోతే వచ్చే ఎన్నికల్లో కారు బోల్తాపడే అవకాశాలున్నాయని గులాబీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దూకుడు పెంచిన ప్రతిపక్షాలు

కారు పార్టీలో కొనసాగుతున్న కొట్లాటలతో సతమతమవుతుంటే బీజేపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ప్రచారజోరు పెంచారు. డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేకం అవుతున్నారు. గత కొద్దిరోజులుగా సైలెంట్‌గా ఉన్న సోమారాపు సత్యనారాయణ తెరవెనుక మంతనాలు చేస్తూ అన్నీ చక్కబెడుతున్నారు. ఎన్నడూ లేనివిధంగా పుట్టిరోజు వేడుకల పేరుతో ఆదివారం నియోజకవర్గంలో పెద్దఎత్తున కార్యక్రమాలకు తెరతీస్తూ.. నియోజకవర్గంలోని నేతలను ఆహ్వానించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇలా నేతల పోటాపోటీ యాత్రలు, భేటీలు, విందులు వినోదాలతో రామగుండం రాజకీయం రసవత్తరంగా మారింది.

ప్రజల ఆశీర్వాదం కోసమే పాదయాత్ర

• బీఆర్‌ఎస్ ఆశావహుల వెల్లడి



పాదయాత్రలో నాయకులు

గోదావరిఖని: ప్రజా ఆశీర్వాదం కోసమే డివిజన్లలో పాదయాత్ర చేస్తున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఆశావహులు కందుల సంధ్యారాణి, మిర్యాల రాజిరెడ్డి, కొంకటి లక్ష్మీనారాయణ, పాతిపెల్లి ఎల్లయ్య తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధిలో ముందుంటే.. రామగుండం వెనుకబడిందని, ఇందుకు స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కారణమని తెలిపారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావాలనేదే తమ ఆకాంక్ష అని పేర్కొన్నారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం టీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి, ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. స్థానిక 30 డివిజన్‌లో గడపగడపకూ వెళ్లి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులు, సంక్షేమ ఫలాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. వీరి ర్యాలీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ నాయకులు పోటీగా ర్యాలీ నిర్వహించి నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తతకు దారితీసింది.

రామగుండం మున్సిపల్ కమిషనర్‌గా నాగేశ్వర్

- బడంగ్‌పేట కార్పొరేషన్‌కు సుమన్‌రావు బదిలీ
- జీహెచ్‌ఎంసీకి డిప్యూటీ కమిషనర్ నారాయణరావు



కోల్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ కమిషనర్ బి.సుమన్‌రావు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్.నాగేశ్వర్‌రావును నియమిస్తూ పురపాలక శాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. సుమన్‌రావును బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. అలాగే రామగుండంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న కే.నారాయణరావును జీహెచ్‌ఎంసీకి బదిలీ చేశారు. సుమన్‌రావు 2021 డిసెంబర్ 14న రామగుండంకు బదిలీపై వచ్చారు. ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ల ఒత్తిళ్లతో గతనెల 30 నుంచి ఈనెల 14వ వరకు సెలవు పెట్టారు. శనివారం విధుల్లో చేరాల్సిన సుమన్‌రావు.. మరో వారంరోజులు సెలవు పెట్టగా సాయంత్రానికి బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. కే.నారాయణరావు నాలుగున్నరేళ్లు పని చేశారు.

అన్నివర్గాలను మోసం చేసిన సీఎం కేసీఆర్

• డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

రామగుండం: అన్ని వర్గాలను సీఎం కేసీఆర్ మోసం చేశారని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. అంతర్గాం మండలకేంద్రంలో పారిశుద్ధ్య కార్మికుల రిలే దీక్షా శిబిరానికి శనివారం సంఘీభావం ప్రకటించారు. సీఎం కార్మికులకు ఇచ్చిన ఈఎస్‌ఐ, పీఎఫ్, ఉద్యోగభద్రత, కారుణ్య నియామకం, ఇన్సూరెన్స్ హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు, ఆర్టీసీ, నిరుద్యోగులను మోసం చేయడమే ఆయన లక్ష్యమని తెలిపారు. పార్టీ మండల ఇన్‌చార్జి పెండ్రు హన్మాన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం ఉన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న రాజ్‌ఠాకూర్

ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు

గోదావరిఖనిటౌన్: జీఎం కాలనీలోని సంజీవాంజనేయ స్వామి దేవాలయంలో రాజ్‌ఠాకూర్ పూజలు చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తఫా, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఈదునూరి హరిప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నజీమ్ ఉన్నారు.

ఎన్టీపీసీ రామగుండంలో ఆర్ఈడీ త్రిపాఠి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టును రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హైడ్రో), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ప్రాజెక్టు మేనేజ్‌మెంట్) ఎస్ఎన్. త్రిపాఠి శనివారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి జ్యోతిభవన్‌కు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ప్రాజెక్టులోని పలు విభాగాలను పరిశీలించారు. ఉన్నతాధికారులతో విద్యుత్ ఉత్పత్తి, ఉత్పాదకత తెలంగాణ ప్రాజెక్టు నిర్మాణ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

గోదావరిఖని: సీఎం కేసీఆర్ తీసుకొస్తున్న సంక్షేమ పతకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం దశాబ్ది ప్రగతి ప్రజాచైతన్య యాత్రను కార్పొరేషన్ పరిధి 36వ డివిజన్‌లో చేపట్టారు. 24 గంటల ఉచిత విద్యుత్‌తో పంటభూములు సస్యశ్యామలం అవుతున్నాయని, రైతుబంధు, రైతుబీమాతో అన్నదాతలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్పొరేటర్లు దొంత శ్రీనివాస్, కుమ్మరి శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవితాసరోజిని, నారాయణదాసు మారుతి, చెలుకలపల్లి శ్రీనివాస్, కలువల సంజీవ్, ముద్దసాని సంధ్యారెడ్డి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే చందర్

అంబేద్కర్ భవనం నిర్మించాలని వినతి

జ్యోతినగర్: కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మ కాలనీలో అంబేద్కర్ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేకు సమతా సైనికదళ్ రాష్ట్ర నాయకులు దుర్గం నగేశ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. 20 గుంటల స్థలం రూ.కోటి నిధులు విడుదల చేయాలని కోరగా అధికారులతో మాట్లాడుతానన్నారు.

క్లుప్తంగా

నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్‌గా అంజన్‌కుమార్



నియామక పత్రం స్వీకరిస్తున్న అంజన్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): నేషనల్ గ్రీన్ కోర్(ఎన్‌జీసీ) జిల్లా కో ఆర్డినేటర్‌గా గూళ్ల అంజన్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా విద్యాధికారి మాధవి నియామక పత్రం అందించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అంజన్‌కుమార్‌ను జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్‌గా నియమించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులతో నిర్వహిస్తున్న జాతీయ హరితదళం కార్యక్రమాలను జిల్లా స్థాయిలో కోఆర్డినేషన్ చేయనున్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారికి అంజన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక



జి.కృష్ణమూర్తి, లైన్‌మెన్, గోదావరిఖని



ఎండీ.వసీంఅలీ, జేఎల్‌ఎం, పెద్దపల్లి



మద్ది అన్వేష్, ఆర్టిజన్ కార్మికుడు

రామగుండం: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 18–20 తేదీల్లో నిర్వహించే తెలంగాణ ట్రాన్స్‌కో అండ్ డిస్కమ్స్ ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలకు రామగుండంకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. కాగా ఈనెల 9న ఇంటర్ సర్కిల్ పోటీల్లో పాల్గొనేందుకు ఔత్సాహికులైన 46 మంది క్రీడాకారులకు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ ఇ.రాజు, కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ఎండీ.వసీంఅలీ, జి.కృష్ణమూర్తి, మద్ది అన్వేష్ ప్రతిభ కనబరచడంతో వీరిని ఇంటర్ సర్కిల్ పోటీలకు ఎంపికచేశారు. వీరి ఎంపికపై ఫుట్‌బాల్ సీనియర్ కోచ్ గణపతినాయుడు, ఎండీ.మునీర్‌అలీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రెండురోజులు 'భగీరథ' నీరు బంద్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు ఆది, సోమవారం మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పూర్ణ చందర్ తెలిపారు. పైపులైన్ మరమ్మతు కారణంగా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

యువకుడి వీరంగం

కరీంనగర్‌క్రైం: మద్యం మత్తులో యువకుడు వీరంగం సృష్టించాడు. స్థానికుల వివరాలు.. నగరంలోని గణేశ్‌నగర్‌కు చెందిన శ్రీనాథ్ శుక్రవారం అర్ధరాత్రి మద్యం తాగి కారు నడుపుతూ విద్యుత్ స్తంభాలు, కిరాణాషాపును ఢీ కొట్టాడు. పెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు బయటకు వచ్చి అతడిని నిలదీయగా, తాను పోలీసు కొడుకును అంటూ బదులివ్వడంతో స్థానికులు పోలీసులను ఆశ్రయించారు. నష్టాన్ని భరించుకుంటానని యువకుడు చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

కాశీ యాత్రికులకు రైల్వే శుభవార్త

- రామగుండం మీదుగా వారణాసి రూట్‌లో నాలుగు రైళ్లు
- రైళ్ల హాల్టింగ్స్‌తో ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులకు ఊరట
- రిజర్వేషన్ల లభ్యతకు కొంత అనుకూలం

రామగుండం: ఇటీవల నూతనంగా రైళ్ల హాల్టింగ్స్‌తో రామగుండం రైల్వేస్టేషన్ నుంచి కాశీ (వారణాసి) తీర్థయాత్రలకు వెళ్లే ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని యాత్రికులకు కొంత ఊరట కలిగించే నిర్ణయం. కాశీ విశ్వనాథుని దర్శనానికి దక్షిణ భారత యాత్రికుల్లో తెలుగు రాష్ట్రాల నుంచే అత్యధికంగా వెళ్తుంటారని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. వీరితో పాటు రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమల్లో పని చేసే కూలీలు ఎక్కువగా బిహార్ రాష్ట్రం వారే కావడంతో ఇక్కడి నుంచి దానాపూర్ వెళ్లే ప్రయాణికుల తాకిడి ఎక్కువ.



రామగుండం రైల్వేస్టేషన్

రామగుండం కేంద్రంగా..

- ప్రతీ రోజు సికింద్రాబాద్–దానాపూర్ (రైలు నం .12791) మధ్య ఒకే రైలు నడుస్తుండడంతో మూడు నెలల క్రితం ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైన పది నిమిషాల్లోనే వెయిటింగ్ లిస్టు వచ్చే పరిస్థితి ఉండేది.
- ఇక అప్పటికప్పుడు అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ప్రయాణానికి ఒక రోజు ముందు అదనపు చార్జీతో తత్కాల్ టికెట్ జారీ చేసే క్రమంలో కూడా ఒక్క సెకనులోనే టికెట్లు పూర్తవడంతో క్యూలైనులో ఉన్న మొదటి వ్యక్తికి కూడా టికెట్ దొరకని పరిస్థితులు ఎన్నో ఉన్నాయి.
- గతంలో కాశీకి టికెట్ పొందిన తర్వాతే యాత్ర పర్యటనను ఖరారు చేసుకునే పరిస్థితి ఉండేది. కాగా దానాపూర్ రూట్‌లో వెళ్లు రెండు వారాంతపు రైళ్లు, ఒకటి రెగ్యులర్ రైలుకు రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్స్ కల్పిస్తున్నట్లు రెండు రోజుల క్రితం దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.
- ఈ నేపథ్యంలో రామేశ్వరం– బనారస్ (నం .22535) అర్ధరాత్రి 12.39 గంటలకు (ప్రతీ శుక్రవారం వేకువజామున), ఎర్నాకులం– పాట్నా (నం.22669) రైళ్లకు అర్ధరాత్రి 12.30 గంటలకు (ప్రతీ సోమవారం వేకువజామున), బెంగళూరు– దానాపూర్ (నం.12295) రైలుకు ప్రతీ రోజు అర్ధరాత్రి 12.39 గంటలకు రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్స్ కల్పించారు.
- కాగా ఇందులో బెంగళూరు–దానాపూర్ సంఘమిత్ర సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు వారణాసికి సమీప స్టేషన్ ప్రయాగ్‌రాజ్ వరకు వెళ్తుంది.

ఇబ్బందిగా ఉండేది



మూడు మాసాల ముందు పర్యాటన షెడ్యూల్ కోసం టికెట్లు తీసుకోవడం కాస్త ఇబ్బందిగా ఉండేది. ఒక రోజు ముందు తీసుకునే తత్కాల్ టికెట్ క్షణాల్లో అయిపోయేవి. ఫ్లైట్‌లో వెళ్లాలంటే టికెట్ ధర రూ.ఐదు వేలకు పైనే ఉంటుంది. నూతన రైళ్ల హాల్టింగ్స్‌తో కనీసం తత్కాల్ టికెట్ దొరికే అవకాశమైనా ఉంటుంది. దానాపూర్ రూట్‌లో నడిచే రైళ్లపై కాస్త ఒత్తిడి తగ్గుతుంది.

– బాకం శంకర్, యాత్రికుడు

కాశీకి టికెట్ తీసుకునేందుకు వచ్చా



మా పేరెంట్స్ అక్టోబర్‌లో కాశీ తీర్థయాత్రలకు వెళ్లనున్న నేపథ్యంలో రిజర్వేషన్ టికెట్ తీసుకునేందుకు వచ్చా. స్లీపర్ క్లాస్ టికెట్లు అయిపోయినా స్లీపర్‌క్లాస్ టికెట్ ధరతో పోల్చితే మూడింతలైనా కనీసం థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ టికెట్లు అందుబాటులో ఉన్నాయి. రాబోయే రోజుల్లో కనీసం కాశీ యాత్రకు వెళ్లేందుకు తత్కాల్ టికెట్ అయినా దొరికే భాగ్యం కలుగుతుంది.

– మద్దికుంట శంకర్, ప్రయాణికుడు

పుస్తక పఠనంతో మానసిక ఆనందం



మాట్లాడుతున్న గట్టయ్య

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు మానసిక ఆనందం పెంపొందుతుందని జిల్లా గ్రంథాలయ డైరెక్టర్ గుడిసెల గట్టయ్య అన్నారు. శనివారం రామగుండం కార్పొరేషన్ 19వ డివిజన్ న్యూమారేడుపాక గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ పుస్తకాల్లో ప్రపంచ జ్ఞానం తెలుసుకోవచ్చని, పుస్తక పఠనం ద్వారా అన్ని విషయాలు అర్థం చేసుకోవడం సులభతరంగా ఉంటుందన్నారు. మహనీయుల చరిత్ర పుస్తకాలు చదివి వారి అడుగుజాడలో నడచుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో డిజిటల్, కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించడంపై ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శోభన్‌రావు, జి.జగదీశ్వర్, పద్మజ, శంకర్, రామస్వామి, స్లీవా, సారయ్య, జ్యోతి వాణి పాల్గొన్నారు.

పంటల సాగుపై కేవీకే ఆధ్వర్యంలో అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్(మంథని): భారత వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఆర్‌ఏ) 95వ స్థాపిత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని పేంచికల్‌పేట గ్రామంలో రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగు విధానాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ఏటా రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, పరీక్ష చేయించిన భూమిలో వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న పంటలను మాత్రమే సాగు చేయాలని సూచించారు. ప్రతి ఏడాది భూమిలో ఒకే రకమైన పంట సాగు చేయకుండా పంట మార్పిడి చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండ వెంకటేష్, ఏవో బండి ప్రమోద్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు భాస్కర్‌రావు, వెంకన్న, కిరణ్, వినోద్, అర్చన, ఏపీఎం శైలజాకాంతి తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో బోనాల పండుగ



బోనాల వేడుకలో నరేందర్‌రెడ్డి, విద్యార్థులు

సుల్తానాబాద్(పెద్దపల్లి): విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేందుకే బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ఆషాఢమాసం సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని అల్ఫోర్స్ స్కూల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం పండుగలకు నిలయమని, పండుగల విశిష్టతను కాపాడటంలో అల్ఫోర్స్ విద్యాసంస్థలు ముందుంటాయన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం



వెంకటలక్ష్మి(ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): ఓదెల గ్రామానికి చెందిన బీరం వెంకటలక్ష్మి(75) నేత్రదానం చేసి ఇద్దరు అంధులకు చూపు నిచ్చింది. వెంకటలక్ష్మి అనారోగ్యంతో శనివారం మృతిచెందగా సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో కుటుంబసభ్యుల అనుమతితో నేత్రాలు సేకరించారు. ఈసందర్భంగా వృద్ధురాలి కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు టి.శ్రవణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, పృథ్వీరాజ్, వాసు, సారంగం తదితరులు అభినందించారు.

వానొస్తే భయమే..

- మంథనిలో కుండపోత వర్షం
- గతేడాది మిగిల్చిన గాయాలపై ఆందోళన

మంథని: వర్షమొస్తే భయపడే పరిస్థితి మంథని ప్రజలది. శనివారం రాత్రి సుమారు గంట పాటు కుండపోతగా వర్షం కురవడంతో ఇక్కడి ప్రజల్లో ఆందోళన మొదలైంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి మొదటిసారిగా భారీ వర్షం కురిసింది. ఇదేతీరు కొనసాగితే పరిస్థితి ఏంటనే భయాన్ని ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూలై 13, 14 తేదీల్లో కాళేశ్వరం బ్యాక్ వాటర్ మూలంగా గోదావరి, మానేరు, బొక్కలవాగు ఉప్పొంగి మంథని మున్సిపాలిటీ సగానికి పైగా మునిగిపోయింది. నియోజకవర్గంలో చాలా గ్రామాలు జలమయమయ్యాయి. ఆ చేదు అనుభవాన్ని శుక్రవారమే నెమరు వేసుకున్న మంథని ప్రజలకు మరుసటి రోజే భారీ వర్షం కురవడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మంథని మున్సిపల్ ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇంట్లో బియ్యం, ఉప్పు, పప్పు, కట్టుబట్టలతో పాటు సర్వం కోల్పోయి అనేక మంది రోడ్డు పాలైన ఘటనను తలచుకుంటూ వణికిపోతున్నారు. ఒక్కో కుటుంబం సరాసరి రూ.50 వేలు నుంచి రూ.పదిలక్షలవరకు నష్టపోయింది. మొత్తంగా వంద కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. అయినా ప్రభుత్వం నుంచి పైసా పరిహారం ఇక్కడి ప్రజలకు అందలేదు. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న క్రమంలో అధికారులు మాత్రం వరద నుంచి ప్రజల్ని కాపాడేందుకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలూ చేపట్టలేదు.

గోరింటాకు సందడి



గోరింటాకు పండుగలో జెడ్పీటీసీ సంధ్యారాణి, తదితరులు

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్: గోరింటాకు పండుగను స్థానిక మార్కండేయకాలనీలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పూజలు చేసి, గోరింటాకు మొక్కలను నాటి ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీటీసీ కందుల సంధ్యారాణి, మిత్రమండలి సభ్యులు వీణ, సత్యవతి, సిరి వినోద, స్వాతి, పద్మ, ఉమ, శారద, సునీత, శ్రీలత, స్వరూప, సంధ్య పాల్గొన్నారు. అలాగే పెద్దపల్లిలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన మెహందీ పోటీల్లో విద్యార్థినులు సందడి చేశారు. ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని ప్రిన్సిపాల్ రాజు, వైస్‌ప్రిన్సిపాల్ నీతారెడ్డి అన్నారు. అధ్యాపకులు అశ్విని, నిర్మల తదితరులు పాల్గొన్నారు.





ట్రినిటి డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల సందడి

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి ఉద్యోగుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపులు

- డైరెక్టర్(పా) ఎన్.బలరాం



డైరెక్టర్(పా)కు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి ఉద్యోగుల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ (పా) ఎన్.బలరాం పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణిభవన్‌లో మల్టీస్పెషాలిటీ మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఉద్యోగులు ఆరోగ్యవంతులుగా ఉంటే సంస్థ కూడా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని, గనులు, కార్యాలయాల్లో ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థ రూ.కోట్లు వెచ్చించి వైద్య విభాగాన్ని ఆధునికరించిందని, 120 సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా ప్రత్యేక సేవలు అందిస్తుందన్నారు. ఇంతే కాక గనులు కార్యాలయాల్లో ప్రత్యేక హెల్త్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పని ఒత్తిడి, కుటుంబ పరమైన బాధ్యతల్లో పడి చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. కోఆర్డినేషన్ జీఎం సురేష్, డిప్యూటీ చీఫ్‌మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకోటయ్య మాట్లాడుతూ, మెగా వైద్య శిబిరంలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌కు చెందిన మెడికవర్, వెల్నెస్, సౌజన్య డెంటల్, విన్‌విజన్, వాసవీ, ఈఅండ్‌టీ, బీబీ క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్య నిపుణులు సహాయ సిబ్బంది వైద్య సేవలు అందించారు. జనరల్ ఫిజిషియన్, కార్డియాలజిస్టు, న్యూరో ఫిజిషియన్, ఆర్థోసర్జన్, గైనకాలజిస్ట్, దర్మటాలజిస్ట్, డెంటల్ సర్జన్, అప్తమాలజీ, ఈఅండ్‌టీ సర్జన్, ఆడియాలజీ, అంకాలజీ నిపుణులు పరీక్షలు నిర్వహించారు.

ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించండి



వినతిపత్రం ఇస్తున్న జాహిద్‌పాషా

గోదావరిఖని(రామగుండం): యూనియన్ కార్యకలాపాలకు దూరంగా ఉన్న ప్రధానకార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి స్థానంలో తనకు అవకాశం కల్పించాలని డిప్యూటీ జనరల్ సెక్రెటరీ జాహిద్‌పాషా కోరారు. శనివారం టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, వర్కింగ్ ప్రసిడెంట్ కెంగర్ల మల్లయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంలో చాలా కాలంగా యూనియన్ క్రమశిక్షణకు లోబడి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వస్తున్నానని, యూనియన్ నాయకత్వం తన శ్రమను గుర్తించి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బాధ్యతలు అప్పగించిందన్నారు. మిర్యాల రాజిరెడ్డి వ్యవహార శైలితో సమస్యల పరిష్కారంలో జాప్యం నెలకొంటుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా యూనియన్ మాతృపార్టీ బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో యూనియన్ బరువు బాధ్యతలు మోసేందుకు తనకు అన్ని అర్హతలు ఉన్నాయని, ఒక్క అవకాశం కల్పించాలని కోరారు.

కార్మికుల సహనాన్ని పరీక్షించొద్దు



మాట్లాడుతున్న నాయకులు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం యాజమాన్యం కార్మికుల సహనాన్ని పరీక్షించవద్దని, చర్చలను వెటనే పూర్తి చేసి కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. కార్మికుల్లో సఖ్యతను విడదీసేందుకు యాజమాన్యం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కార్మిక సంఘాల నాయకులపై ఎస్మా, కేసుల పేరుతో భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. టూల్ డౌన్ సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేయనున్నట్లు ప్రకటించారు. గేట్ పాస్‌ల జారీలో వివిధ రకాలుగా కార్మికులపై ఆంక్షలు విధించి పాస్‌లను నిలిపివేయడం వెంటనే మానుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, గీట్ల లక్ష్మారెడ్డి, రాధారపు రాజమల్లయ్య, అధిక సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు అండగా ఐఎన్టీయూసీ

- బాబర్ సలీంపాషా



మాట్లాడుతున్న బాబర్ సలీంపాషా

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్టీయూసీ యూనియన్ అండగా ఉంటుందని ఎన్సీబీసీ సభ్యుడు, ఐఎన్టీయూసీ జాతీయ సీనియర్ కార్యదర్శి బాబర్ సలీంపాషా అన్నారు. శనివారం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. కార్మికుల వేతన ఒప్పందానికి సంబంధించిన అంశం కార్మిక సంఘం ఎన్నికలతో ముడిపడి ఉందని, ముందుగా ఎన్నికలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన సంఘం యాజమాన్యంతో మాట్లాడితే సమస్యను పరిష్కరించేందుకు అవకాశం సులువుగా ఉంటుందని వెల్లడించారు. ఆర్‌ఎల్‌సీ సమక్షంలో చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కొంతమంది నాయకులు కార్మికులను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలను కార్మికులు తిప్పికొట్టాలన్నారు. అలవెన్సుల పెంపుదల అంశంలో యూనియన్ కార్మికులకు న్యాయం చేసేందుకు అగ్రభాగాన ఉంటామని హామీ ఇచ్చారు. కార్మికులు విద్యుత్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నారని, ఎస్మా చట్టం ఉంటుందని వెల్లడించారు. కార్మికుల డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో కార్మికులు పాల్గొన్నారు.

మెరుగైన వేతనాలు ఇవ్వాలి



సమావేశంలో నాయకులు, కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మెరుగైన వేతనాలు చెల్లించాలని సింగరేణి వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. శనివారం ఆర్జీ–2 జీఎం కార్యాలయంలోని హౌస్ కీపింగ్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికుల శ్రమతోనే సింగరేణి లాభాలను గడిస్తుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం ఐఎఫ్‌టీయూ ముందుండి పోరాటాలు చేస్తుందని వివరించారు. అనంతరం ఐఎఫ్‌టీయూ సెక్షన్ కమిటీని ప్రకటించారు. కార్యదర్శిగా బండ పద్మ, నిర్మల, కార్యవర్గ సభ్యులుగా రాజనర్సు, సమ్మక్క, కుమార్, మల్లయ్య, శంకర్, సమ్మయ్య, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, శారదను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వమే ఆదాయ పన్ను చెల్లించాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కార్మికులకు ఆదాయ పన్నును రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం రామగుండం ఏరియా–2 వర్క్‌షాప్ ఆవరణలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. బొగ్గు గని కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు మెరుగైన వేతనం, అలవెన్సులు చారిత్రాత్మకమైన ఒప్పందం చేశామని తెలిపారు. వేజ్ బోర్డు బకాయిలు చెల్లించుటకు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి త్వరలోనే చెల్లించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు భవిష్యనిధి ఖాతా వివరాలు తెలుసుకునేందుకు, అవినీతికి తావు లేకుండా మెరుగైన సేవలు అందించుటకు జాతీయ నాయకత్వం సమష్టిగా తీసుకున్న నిర్ణయం ప్రకారం మంత్రిత్వ శాఖ ఆమోదించి ఆన్‌లైన్ పద్ధతిని ప్రవేశపెట్టడంలో బీఎంఎస్ పాత్ర ఎంతో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణికి రావాలసిన విద్యుత్తు బొగ్గు బకాయిలు రూ.25 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సంస్థ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఏరియా ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పొన్నమనేని వేణుగోపాలరావు, పెండెం సత్యనారాయణ, నూతి శ్రీమన్నారాయణ, చిర్ర ఆంజనేయులు, నీలం రవి మంచినీళ్ల స్వామి, ముదాం సత్తయ్య, చక్రపాణి, సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ కేంద్ర ఉపాధ్యక్షుడు బండారి శ్యాంసుందర్, కేంద్ర కార్యదర్శి, చెన్నూరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.